ప్రజాశక్తి
శనివారం 19 అక్టోబర్ 2024
5
శ్రీ సత్యసాయి

విద్యుత్ శాఖ అధికారిణికి వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రతి పక్షంలో ఓ రకం.. అధికారంలో ఉంటే మరో రకం..

సిపిఎం జిల్లా నాయకులు జెడ్‌పి. శ్రీనివాసులు

ట్రూఆప్ ఛార్జీల పెంపునకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-హిందూపురం

తెలుగుదేశం పార్టీ ప్రతి పక్షంలో ఉన్న సమయంలో ఒక రకంగా అధికారంలోకి వచ్చిన తరువాత మరో రకంగా వ్యవహరిస్తోందని సిపిఎం జిల్లా నాయకులు జడ్‌పి శ్రీనివాసులు విమర్శించారు. విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్న డిమాండ్‌తో సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోనిఢి డిఇ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు జడ్‌పి శ్రీనివాసులు మాట్లాడుతూ అప్పటి వైసిపి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచితే బాదుడే...బాదుడు పేరుతో ఆందోళన చేసిన టిడిపి అధికారంలోకి రాగానే ట్రూ ఆప్ చార్జీల పేరుతో ప్రజలపై బాదుడే..బాదుడును ప్రారంభించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసర ధరలు ఆకాశానంటుతున్నాయని, వరుస తుపాను కారణంగా ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. సరైన ఉపాధి లేక చాలీచాలని వేతనాలతో కుటుంబాన్ని పోషించుకోలేక సామాన్య మధ్యతరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ఇలాంటి తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానాను నింపుకోవడానికి, ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై రూ. 814 కోట్ల భారాన్ని వేసేందుకు చర్యలు చేపట్టడం బాధాకరమన్నారు. ఎనిమిది నెలలకు ముందే విద్యుత్ సంస్థలు విద్యుత్తు నియంత్రణ మండలికి ప్రతిపాదనలు పంపినా కాలయాపన చేసి, కనీసం అసెంబ్లీలో కూడా చర్చించకుండా, ప్రజాభిప్రాయాన్ని సేకరించకుండా 12 పి టి సి లపై ఒకేసారి హడావిడిగా విచారణ చేపట్టడం తగదన్నారు. వైసిపి అధికారంలో ఉన్న సమయంలో ఇదే ట్రూ ఆప్ చార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలను పెంచితే బాదుడే బాదుడని టిడిపి ఆందోళన చేపట్టిందని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వస్తే చార్జీలు పెంచమని హామీ ఇచ్చిన వారు అధికారంలోకి వచ్చిన అనంతరం మాట మార్చి విద్యుత్ ఛార్జీలు పెంచడానికి ప్రయత్నం చేయడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. ట్రూ అప్ ఛార్జీల పెంపు నిర్ణయాన్నివెంటనే ఉపసహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలను చైతన్యం చేసి, ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రమణ, బాబావలి, రాము, సదాశివా రెడ్డి, ఆంజినేయులు, నందీశ్వర, నాగప్ప, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త కదలదు...మురుగు పారదు

ఎక్కడి వ్యర్థాలు అక్కడే
ప్రబలుతున్న వ్యాధులు..
రోగాల బారిన ప్రజలు
పాలన మరచిన పాలకవర్గం

ప్రజాశక్తి-పెనుకొండ

అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యం వెరసి పెనుకొండ పట్టణంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోతోంది. మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయి నీరు ఎక్కడిక్కడే నిలబడి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారిపోయాయి. దోమల బారిన పడిన ప్రజలు రోగాలతో ఆస్పత్రుల పాలవుతున్నారు. నగర పంచాయతీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి ప్రజలకు మేలు చేయాల్సిన పాలకవర్గం తన పాలన మరిచిపోయింది. పెనుకొండ నగరపంచాయతీ పరధిలో 20 వార్డులు ఉన్నాయి. కోనాపురం, మంగాపురం, వెంకటరెడ్డి పల్లి, ఇస్లాపురం మినహా పట్టణంలోనే మిగిలిన వార్డులున్నాయి. దాదాపు 23వేల మంది జనాభా ఉంది. . పట్టణంలో ఉన్న అన్ని వార్డుల్లోనూ మురుగునీటి పారుదల అస్తవ్యస్తంగా ఉంది. 20 ఏళ్ల క్రితం నిర్మించిన డ్రయినేజీలు దెబ్బతిన్నాయి. పాలకులు డ్రైనేజీల నిర్మాణం చేపట్టేందుకు పలు కౌన్సిల్ సమావేశాల్లో తీర్మానాలు చేసినప్పటికీ ఆచరణలో అమలు కాలేదు.

అధికారుల నిర్లక్ష్యం

అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు ప్రాణసంకటంగా మారింది. రోజూ చెత్త తొలగింపు చేసి, కాల్వల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించే చర్యలు చేపట్టాలి. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా నగర పంచాయతీ పరిధిలోని అన్ని వార్డుల్లో మురుగు కాల్వల్లో చెత్త పేరుకు పోతోంది. ఇంటింటికి చెత్త సేకరణ ఊసే లేదు. ఇళ్లల్లో పేరుకుపోయిన చెత్తను కాల్వల్లోకి వేస్తున్నారు. కాల్వల్లో చెత్త పేరుకుపోయి మురుగునీరు రోడ్ల పైకి వస్తున్నాయి. చెత్త సేకరించే ట్రాక్టర్లు కొన్ని వార్డులకు వారానికి ఒకసారి మాత్రమే వెళుతున్నాయి.

ఎక్కడి వ్యర్థాలు అక్కడే...

అధికారుల పర్యవేక్షణ లోపం సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోతోంది. రోజూ చెత్త తొలగింపు సక్రమంగా జరగడం లేదు. కొన్ని వార్డుల్లో వారానికి ఒక సారి చెత్త సేకరిస్తున్నారు. పట్టణం నడిబొడ్డున ఉన్న ప్రధాన మురుగుకాల్వ ప్లాస్టిక్ కవర్లు, బాటిల్లు, ఇతర చెత్తతో నిండిపోయింది. దీనికితోడు అక్కడ ఉన్న పూలదుకాణాలు, చికెన్ షాపులు, ఇతర అంగళ్ల వారు వేసే చెత్త కాలువల్లో వేస్తున్నారు. పట్టణంలోని ప్రధానకూడలిలోనే ఇలా ఉంటే నివాస ప్రాంతాల్లో ఉండే మురుగుకాల్వల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఆదివారం వస్తే ఇక చెప్పనక్కర్లేదు. వారపు సంత కావడంతో సంతలో వ్యర్థాలను ఎక్కడిక్కడే వదిలేసి వెళుతున్నారు. ఏరోడ్డులో చూసినా వ్యర్థాలే కనిపిస్తాయి. కొన్ని చోట్ల డ్రయినేజీలను మట్టితో పూడ్చి వేశారు. ప్రతిరోజు అధికారులు అదే దారిలో తిరుగుతున్న కాల్వలో ఉన్న మట్టిని తొలగించే చర్యలు చేపట్టేందుకు చొరవ చూపడం లేదు. మరికొన్ని చోట్లు కాల్వల్లో కంపచెట్లుతో నిండిపోయి మురుగునీరు నిలిచిపోతోంది. వాటిని తొలగించే చర్యలను అధికారులు తీసుకోవటం లేదు.

రోగాల బారిన ప్రజలు

సీజనల్ వ్యాధులతో ప్రజలు రోగాల బారినపడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. నగర పంచాయతీ పరిధిలో మురుగు నీరు ఎక్కడిక్కడ నిలబడిపోయి, దోమలను ఉత్పత్తి చేస్తున్నాయి. దీంతోప్రజలు రోగాల బారిన పడుతున్నారు. రోగాలతో ప్రజలు ఆస్పత్రుల చుట్టు తిరిగి జేబులకు చిల్లులు వేసుకుంటున్నారు. వ్యాధులు ప్రబల కుండా దోమల నివారణకు ఫాగింగ్ చేయించాల్సిన అధికారులు తమకు ఏమి ఏరుగనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ప్రజల్లో వెల్లువెత్తుతున్నాయి.

పాలన మరిచిన పాలక వర్గం

పెనుకొండ నగరపంచాయతీ పాలక వర్గం పాలన మరిచిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటినుంచి పాలక వర్గ సభ్యులు నగర పంచాయతీ కార్యాలయానికి రావటమే మరచిపోయారు. పెనుకొండ నగర పంచాయతీలో 20వార్డులుండగా అందులో 18 వార్డుల్లో వైసీపీకి చెందిన కౌన్సిలర్లున్నారు. కేవలం రెండు వార్డుల్లో తెలుగుదేశం కౌన్సిలర్లున్నారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు, కోఅప్షన్ సభ్యులు అందరూ వైసీపీకి చెందిన వారే ఉన్నారు. రాష్ట్రంలో వైసీపీ అధికారం కోల్పోయిన తర్వాత పాలక వర్గ సభ్యులు నగర పంచాయతీ కార్యాలయం వైపే కన్నెత్తి చూడడం లేదు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపాల్సిన ఛైర్మన్ పాలనే మరిపోయి వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. నగర పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులను గాడిలో పెట్టాల్సిన పాలకవర్గం ప్రజలకు కనుచూపుమేరలో కనిపించకపోవడం శోచనీయం.

మంత్రి దృష్టి సారించాలి

నగర పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై స్థానిక మంత్రి సవిత దృష్టి సారించాలి. జనాభాకు తగినంత పారిశుధ్య కార్మికులు నగరపాలక పరిధిలో లేరు. కార్మికుల సంఖ్య పెంచి, ప్రతిరోజూ కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలి.

గంగాధర్,
వ్యవసాయ కార్మికసంఘం జిల్లా సహాయ కార్యదర్శి

డంపింగ్ యార్డ్‌ను తొలగించాలని వినతి

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని ఎముకలగుట్టపల్లి జగనన్న లే అవుట్‌లో జనావాసాల మధ్య ఉన్న డంపింగ్ యార్డ్‌ను తక్షణమే తొలగించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కాలనీవాసులు ఎంపిడిఒ నరేంద్రకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ముందుగా వ్యకాసం నాయకులు లే అవుట్‌లో ఉన్న డంపింగ్ యార్డ్‌కు వెళ్లి పరిశీలించారు. వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ ఎముకలగుట్టపల్లి జగనన్న లేఅవుట్‌కు ఆనుకొని డంపింగ్ యార్డ్‌లో మాంసం, తదితర వ్యర్థాలు వేయడం వల్ల దుర్వాసన వెదజల్లుతుందని దీంతో కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారన్నారు. అలాగే విద్యుత్, తాగునీరు, తదితర కనీస సదుపాయాలు లేకపోవడం వల్ల కొన్ని ఇళ్లు అర్ధాంతరంగా నిర్మాణాలు ఆగిపోయాయన్నారు. డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించకపోతే సోమవారం ఎంపిడి ఒ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండ వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యురాలు స్వర్ణలత, కాలనీవాసులు గౌస్, బాబ్‌జాన్, షామీర్, జహీర్, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న వ్యకాసం నాయకులు

మరోసారి వర్షం హెచ్చరిక

'అనంత' ఉత్తర భాగంలో భారీ వర్షసూచన
ఇప్పటి వరకు సాధారణ వర్షపాతమే..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాకు మరో తుఫాను హెచ్చరిక వెలువడింది. ఎప్పుడూలేని విధంగా ఈశాన్య రుతుపవానల సమయంలో అనంతపురం, గుంతకల్లు, గుత్తి ప్రాంతాల్లో భారీ వర్షసూచన ఉన్నట్టు వాతావరణ శాఖ ప్రకటన వెలువరిచింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే ఈనెల 15వ తేదీ నుంచి తుఫాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడ్డాయి. అయితే ఒక మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలే ఈ రెండు రోజులు పడ్డాయి. ఈనెల 19వ తేదీ మాత్రం పెద్దఎత్తున వర్షాలున్నట్టు వాతావరణ శాఖ ప్రకటన వెలువరిచింది.

ఇప్పటి వరకు ఓ మోస్తరే..

అక్టోబరు మాసంలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 71.2 మిల్లిమీటర్లు అయితే నమోదయిన వర్షపాతం 95 మిల్లిమీటర్లు. సాధారణం కంటే 33.5 మిల్లిమీటర్లు అధికంగా ఈనెలలో వర్షపాతం నమోదయింది. ఇందులో అత్యధికంగా ఈనెల 15వ తేదీ నుంచి జిల్లాలో వర్షపాతం నమోదయింది. తుఫాను ప్రభావంతో 31 మండలాల్లో ఒక మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలే పడ్డాయి. ఈ అక్టోబరు మాసంలో అత్యధికంగా ఆత్మకూరు మండలంలో 207 శాతం అధికంగా వర్షపాతం నమోదయింది. సాధారణ వర్షపాతం ఈ మండలంలో 48.6 మిల్లిమీటర్లు అయితే 149.4 మిల్లిమీటర్లు పడింది. ఆ తరువాత రాయదుర్గంలో 133 శాతం అధికంగా వర్షం పడింది. అక్కడ 58.1 మిల్లిమీటర్లు సాధారణం అయితే 135.1 మిల్లిమీటరు అధికారంగా పడింది. ఉరవకొండలో 144 శాతం అధికంగా వర్షం పడింది. సాధారణం 60.4 మిల్లిమీటర్లు సాధారణం అయితే 147.8 మిల్లిమీటర్లు అధికంగా నమోదయింది. ఇలా బొమ్మనహాళ్ 159 శాతం, డీ.హీరేహాళ్ 173 శాతం అధికంగా వర్షం పడింది.

భారీ వర్షసూచనతో అప్రమత్తం

ఈనెల 17వ తేదీ వరకే తుఫాను ప్రభావమని ముందుగా వాతావరణ శాఖ ప్రకటించింది.అయితే ఈ17వ తేదీ వరకు జిల్లాలో ఓ మోస్తరు నుంచి చిరుజల్లులే పడ్డాయి. ఇది అయిపోయిన తరువాత 18వ తేదీ సాయంత్రం మరో వర్షసూచన ప్రకటన వెలువడింది. అనంతపురం, గుత్తి, గుంతకల్లు ప్రాంతాల్లో ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం పడే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో అధికారులు ఆయా ప్రాంతాల్లో అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంతోపాటు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల సమయంలో విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఇప్పటికే జిల్లా కలెక్టరు కార్యాలయంలో కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారుజ ఈ వర్షాలు ఉద్యానపంటలతోపాటు, కంది పంట ఇతర పంటలపై తీవ్ర ప్రభావం చూపనుంది.

ట్రెక్కింగ్ శిక్షణలో ఎల్ఆర్‌జి విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని కిరికెర వద్ద ఉన్న ఎల్ఆర్‌జి విద్యాలయ విద్యార్థులు ట్రెక్కింగ్ శిక్షణలో పాల్గొన్నట్లు విద్యాలయ హెచ్‌ఎం ప్రసాద్ శుక్రవారం తెలిపారు. తిరుపతి కేంద్రంగా ఈ నెల 6 నుండి 13వ తేదీ వరకు నిర్వహించిన ట్రెక్కింగ్ శిక్షణకు దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి ఐదు డైరెక్టర్లకు సంబంధించిన 510 మంది ఎన్‌సిసి విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఇందులో కర్నూలు గ్రూపులో భాగమైన 6 ఆంధ్రా బెటాలియన్ తరపున 10 మంది విద్యార్థుల్లో స్థానిక కిరికిర ఎల్ఆర్‌జి విద్యాలయానికి చెందిన బిఎన్. నీరజ్, ఎం. భరత్ తేజ లతో పాటు థర్డ్ ఆఫీసర్ కెఎన్. హరికుమార్ పాల్గొన్నారని చెప్పారు. 8 రోజుల పాటు జరిగిన శిక్షణలో దాదాపు 150 కిలోమీటర్లు అటవీ ప్రాంతంలో యాత్రను కొనసాగించి లక్ష్యాన్ని పూర్తి చేశారన్నారు. ట్రెక్కింగ్‌లో పాల్గొన్న విద్యార్థులను పాఠశాల కార్యదర్శి బాలసుందరం, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, పరిపాలన అధికారి సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

శిక్షణలో పాల్గొన్న ఎన్‌సిసి విద్యార్థులు, అధికారి

20న మూర్ఛవ్యాధి వైద్య శిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 20వ తేదీ ఆదివారం పట్టణంలోని అల్ హి లాల్ పాఠశాల ఆవరణంలో మూర్ఛ వ్యాధి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు జెవివి అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, డాక్టర్ ఇటి. రామమూర్తి తెలిపారు. పరిగి మండలం దివ్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ పరిగి వేణుగోపాలరావు పాల్గొని ఈ శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. ఈ వైద్యశిబిరాన్ని మూర్ఛ రోగులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ తెలిపారు. 33 కెవి, 11 కెవి లైన్ల అత్యవసర మరమ్మతుల కారణంగా 33/22 కెవి ఇండోర్ సబ్ స్టేషన్, శ్రీకంఠాపురం విద్యుత్ ఉపకేంద్ర పరిధిలోని ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

అప్రాచెరువులో గుప్తనిధుల తవ్వకాలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని అప్పరాచెరువు గ్రామంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. ప్రజలు దైవంగా భావించి భక్తితో కొలిచే బండరాయిని జెసిబి సాయం తో తొలగించినట్లు తెలుస్తోంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. అప్పరాచెరువు గ్రామంలో చెరువు మరువకట్ట సమీపంలో పోతులయ్యస్వామి గుడి వద్ద అపరాధయ్యస్వామిగా కొలిచే పెద్ద బండరాయిని గుర్తుతెలియని వ్యక్తులు తొలగించి అక్కడ సుమారు 20 అడుగుల గుంతను తవ్వారు. దుండగులు గతంలో కూడా అపరాధయ్యస్వామి బండను తొలగించడానికి పలుమార్లు ప్రయత్నాలు చేసినా విఫలమయ్యారు. దీంతో గురువారం రాత్రి వర్షం కురుస్తుండగా ఇదే అదనుగా భావించి ఏకంగా జెసిబి సాయంతో పెద్ద పెద్ద బండరాళ్లను తొలగించారు. మాంత్రికులతో పూజలు చేయించిన ఆనవాళ్లను శుక్రవారం ఉదయం రహదారి వెంబడి గ్రామస్తులు గుర్తించారు. రెండు మూడు రోజులుగా గ్రామంలో కొత్త వ్యక్తులు కారులో రెక్కీ నిర్వహించినట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై మరింత విచారణ చేయాల్సి ఉందని ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు.

జెసిబి సాయంతో తవ్విన గుంతను చూస్తున్న ప్రజలు

ఎన్నికల హామీలు అమలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి- కొత్తచెరువు

ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. స్థానిక ధర్మవరం రహదారిలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పవన్‌కుమార్ అధ్యక్షతన మండల శాఖ మహాసభ నిర్వహించారు. స్థూపం వద్ద జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ డిసెంబర్ 1, 2 తేదీల్లో సిపిఎం జిల్లా మహాసభలు నిర్వహిస్తామన్నారు. వాటికి ముందు గా జిల్లాలోని అన్ని శాఖల మహాసభలు జరిపి ప్రతినిధులను ఎన్నుకుంటామన్నారు. గతంలో చేసిన పోరాటాలపై సమీక్ష చేసుకొని రానున్న మూడేళ్లలో ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై పెద్దఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. ప్రపంచ గుర్తింపు పొందిన తిరుమల తిరుపతి దేవాలయాన్ని రాజకీయం చేయడం బాధాకరమన్నారు. తితిదేపై సుప్రీంకోర్టు సైతం కీలక వాక్యాలు చేస్తూ దేవుడిని రాజకీయాల్లోకి లాగొద్దని హెచ్చరించిందన్నారు. ప్రాథమిక సాక్ష్యాధారాలు లేకుండానే లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడినట్లు పేర్కొని కోట్లాదిమంది భక్తుల మనోభావాలు దెబ్బతీశారన్నారు దేశంలో పదేళ్లుగా పాలన సాగిస్తున్న బిజెపి ప్రభుత్వం మతతత్వంతో ప్రజలను రెచ్చగొడుతుందన్నారు. ప్రధానమంత్రి ఎన్నికల సమయంలో మత విద్వేష ప్రసంగాలు చేయడం తగదన్నారు. భారతదేశం లౌకిక దేశం అని, అన్ని కులాలు సమానం అన్నారు. ప్రభుత్వం నూతన మద్యం పాలసీని ప్రవేశపెట్టి ఆదాయం కోసం పాకులాడుతుందన్నారు. మద్యం షాపులను ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. కృష్ణా జిల్లాలో వరదలతో నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శిగా ముత్యాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు లక్ష్మీనారాయణ, అంజి, శ్రావణి, నాగమణి, లక్ష్మన్న, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం మండలంలోని బేవినహళ్లి, సోమందేపల్లిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు

'పల్లె పండుగ'తో గ్రామాల అభివృద్ధి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని మాగేచెరువు, సోమందేపల్లి గ్రామాల్లో శుక్రవారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మాగేచెరువు పంచాయతీలో సర్పంచి నరసింహమూర్తి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రూ. 40 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేశారు. సోమందేపల్లి మేజర్ పంచాయతీలోని సప్తగిరి కాలనీలో రూ. 20 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మమతాదేవి, ఈవోఆర్డీ లక్ష్మీనరసమ్మ, ఉపాధి హామీ ఎపిఒ సోమశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామాంజి, టిడిపి మండల కన్వీనర్ సిద్ధలింగప్ప, నాయకులు వెంకటరమణ, వెంకటేష్, డీలర్ మురళి, వెన్నెప్పరం అంజి, ఫీల్డ్ అసిస్టెంట్ రామాంజనేయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరువు : 'పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాల'లో భాగంగా మండలంలోని ఓరువాయి గ్రామపంచాయతీలో ఆర్ అండ్ బి రోడ్డు నుంచి మదానావాండ్లపల్లి వరకూ సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే నల్లచెరువులో రూ. 10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచి పంచరత్నమ్మ, ఎంపీడీవో రఘునాథగుప్తా, ఏవో భారతి, ఎపిఎం రమణప్ప, పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలమత్తూరు : పల్లె పండగతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి తెలిపారు. మండలంలోని కోడూరు పంచాయతీలో సుబ్బారావుపేట-కందూరుపర్తి బిటి రోడ్డు, శెట్టిపల్లి పంచాయతీలోని బీదిరెడ్డిపల్లి గ్రామంలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. కార్యక్రమం లో సర్పంచి మురళి, ఎంపిడిఒ రమణమూర్తి, ఈవోఆర్డీ భాస్కర్, టిడిపి నాయకులు బేకరీ గంగాధర్, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి ఎవి.రమణ, అగ్గి శ్రీనివాసులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలంలోని అడవిబ్రాహ్మణపల్లితండా, మల్లేపల్లి, తప్పెటవారిపల్లి, ఒడ్డికంద తండా, కొండగుట్టపల్లి, సానేవారిపల్లి గ్రామాల్లో ఎంపిపి గొడ్డుమర్రి ఆదినారాయణయాదవ్ ఆధ్వర్యం లో పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించారు. రూ. 3 కోట్ల వ్యయంతో మండల వ్యాప్తంగా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు, సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ విజయభాస్కర్, ఎపిఒ రమణారెడ్డి, నాయకులు కృష్ణమూర్తియాదవ్, గౌడగు అమీర్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఐనుములవారిపల్లిలో టిడిపి కార్యకర్త చిన్నగంగన్న గుండెపోటుతో మృతి చెందగా ఆదినారాయణయాదవ్ వారి ఇంటికి వెళ్లి రూ. 10వేలు అందజేశారు.

గుడిబండ : మండలంలోని ముత్తుకూరు, తాళికెర గ్రామ పంచాయతీల్లోని గ్రామాల్లో సర్పంచులు, అధికారులు ఆధ్వర్యంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో గంగాధర్, ఈవోఆర్డీ నాగరాజునాయక్, ఉపాధి హామీ ఏపీఓ భార్గవి, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందూపురం : పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రూరల్ మండల పరిధిలోనిబేవినహళ్లి, సంతేబిదనూరు గ్రామల్లో రూ.1.30కోట్లతో నూతన సిసి రోడ్ల నిర్మాణ పనులను ఎంపిడిఒ నరసింహ్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు బేవినహళ్లి ఆనంద్, పిఆర్ ఎఇ లక్ష్మి నాయక్, ఎపిఒ లలిత కుమారి, సచివాలయ ఉద్యోగులు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

నేడు, రేపు మంత్రి పర్యటన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఈ నెల 19, 20 తేదీల్లో నియోజక వర్గంలో పర్యటిస్తారని మంత్రి కార్యాలయ ప్రతినిధి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం బత్తలపల్లి మండలంలోని మాల్యవంతం గ్రామ ఎస్సీ, బీసీ కాలనీల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపన, 'పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు' కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత అనంతపురం నగరంలోని జడ్పీలో జరిగే జిల్లా పరిషత్ సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో బిజెపి సభ్యత్వ నమోదు డ్రైవ్‌పై సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం స్థానిక రాఘవేంద్ర కల్యాణ మండపంలో హ్యాండ్లూమ్, పవర్‌లూమ్ మర్చెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే సన్మాన కార్యక్రమంలో పాల్గొంటారు. ఆదివారం ఉదయం ముదిగుబ్బ మండలంలో, మధ్యాహ్నం తాడిమర్రి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమలను ప్రారంభిస్తారు. ఆ తర్వాత గొట్లూరు గ్రామం వెళ్లి ఎస్‌డబ్ల్యు పిసి షెడ్‌ను ప్రారంభోత్సవం, సీసీ రోడ్డు శంకుస్థాపన, సచివాలయంలో 'పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు' కార్యక్రమంలో పాల్గొంటారు. ఆయా కార్యక్రమాల్లో మండల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు మాల్యవంతానికి మంత్రి

బత్తలపల్లి : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శనివారం మండలం లోని మాల్యవంతం గ్రామంలో పర్యటిస్తారని టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి తెలిపారు. బత్తలపల్లిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు'లో భాగంగా మాల్యవంతం గ్రామంలో నిర్వహించే పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రితో పాటు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక, మౌలిక వసతుల కల్పన డైరెక్టర్ గోనుగుంట్ల విజయ్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు. వారు ఎస్సీ, బీసీ కాలనీల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మంత్రి పర్యటనలో అధికారులతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో మహేష్

చౌకధాన్యం స్టాక్ పాయింట్ తనిఖీ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని మార్కెట్ యార్డులో ఉన్న ప్రభుత్వ చౌక ధాన్యం స్టాక్ పాయింట్ (ఎంఎల్ఎస్)ను శుక్రవారం ఆర్డీవో మహేష్ సందర్శించి స్టాకు రిజిస్టర్లు, నిల్వలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గోదాములో ఉన్న బ్యాగులను తూకం వేసి పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ ప్రజలకు ప్రతి నెలా తగిన సమయంలో నిత్యావసర సరుకులు సక్రమంగా అందించాలని అధికారులకు సూచించారు. ఎక్కడా పొరపాటు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట సిఎస్‌డిటి లక్ష్మీదేవి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చిలమత్తూరు తహశీల్దార్‌గా యూనస్

ప్రజాశక్తి-చిలమత్తూరు

రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ యూనస్‌బాబుకి చిలమత్తూరు తహశీల్దార్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా లేపాక్షి తహశీల్దార్ సౌజన్య లక్ష్మి ఉండేవారు. అయితే పరిపాలన సందర్భంగా ఆమె రెండు మండలాల్లో విధుల నిర్వహణకు సమస్యలు వస్తుండటంతో పరిపాలన సౌలభ్యం కోసం రీసర్వే డిటి యూనస్‌బాబుకి తహశీల్దార్ బాధ్యతలు ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ

పుట్టపర్తి రూరల్ : జిల్లా ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు శుక్రవారం పోలీసు అధికారులు, సిబ్బంది జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. అలాగే ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి ప్రధాన రహదారులు, బస్టాండ్, రైల్వేస్టేషన్లలో అపరిచిత వ్యక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. గంజాయి, మత్తు పదార్థాలు వాడడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. వాహనాల తనిఖీలు, మద్యం, ఇసుక అక్రమ రవాణా, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టు వేసేలా చర్యలు చేపట్టారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పాత నేరస్తుల కదలికలపై దృష్టి సారించడంతో పాటు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని, సమస్యలు ఏవైనా ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-తనకల్లు

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కదిరి రూరల్ సిఐ నాగేంద్ర, తనకల్లు ఎస్ఐ గోపి కౌన్సెలింగ్ ఇచ్చారు. గతంలో రౌడీ షీటర్లుగా నమోదైన వ్యక్తులు సంఘవిద్రోహక చర్యలకు పాల్పడినా, శాంతిభద్రతలకు వివాదం కలిగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జనజీవన స్రవంతిలో ప్రశాంతంగా జీవనం సాగించాలని గొడవలు, కొట్లాటలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలంలోని శ్రీఎర్రదొడ్డి గంగమ్మతల్లి దేవస్థానానికి శుక్రవారం ఎర్రదొడ్డి పంచాయతీలోని నాగూర్ వండ్లపల్లిలో నివాసం ఉంటున్న ఇంద్రావతి రూ. 10 వేలు విరాళాన్ని మాజీ సర్పంచి కుపేందర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో పూజారి జస్వంత్‌రెడ్డి, అటెండర్ వినోద్‌కుమార్, జయవర్ధన్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు చేయూతనివ్వాలి

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం భవిత కేంద్రం ఆధ్వర్యంలో నిర్దిష్ట అభ్యాస వైకల్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఇఒ జయభాస్కర్ అంగ వైకల్యం ఉన్న వారు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని సూచించారు. అలాగే సమాజంలోని ప్రతిఒక్కరూ వారి పట్ల మంచిగా మెలగాలన్నారు. అనంతరం వివిధ ప్రతిభావంతులకు క్రీడా పోటీలు నిర్వహిం చారు. అలాగే గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో గిరిస్వామి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్య కర్తలు, భవిత కేంద్రం నిర్వాహకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఒడిసిలో ర్యాలీ చేపట్టిన విద్యార్థులు

ఓబుళదేవరచెరువు : అంగవైకల్యం ఉన్న పిల్లలకు శిక్షణ ఇస్తే ఎందులోనైనా రాణిస్తారని ఎంఇఒలు సురేష్‌బాబు, రమణ సూచించారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో మండలంలోని భవిత కేంద్రం పిల్లలు, ఒడి చెరువు ప్రాథమిక పాఠశాల పిల్లలతో నిర్దిష్ట అభ్యసన వైకల్యంపై ర్యాలీ నిర్వహించారు. వికలాంగులను తక్కువ దృష్టితో చూడకుండా వారి జీవనోభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నాగశేఖర్‌రెడ్డి, నరసింగబాబు, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం

పెచ్చులూడిన పాఠశాల భవనం పైకప్పు

శిథిలావస్థలో పాఠశాల భవనం

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని జమ్మానిపల్లి ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు బాగా తడిచి పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీంతో పైకప్పులో ఇనుప కడ్డీలు కనిపిస్తున్నాయి. దీనికి తోడు వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఏ క్షణాన ఏమి జరుగుతుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల భవనం దుస్థితిని గతంలోనే మండల విద్యాధికారి, పంచాయతీ ఇంజినీరింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం తొలగించి కొత్త భవనం నిర్మించాలని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళిబాబు, గ్రామస్తులు, కోరుతున్నారు.



కేంద్రమంత్రి మురుగన్‌కు స్వాగతం పలుకుతున్న జెసి అభిషేక్‌కుమార్

సత్యసాయి సమాధిని దర్శించుకున్న కేంద్రమంత్రి మురుగన్

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

కేంద్ర సమాచార, పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ శుక్రవారం సత్యసాయి మహాసమాధి దర్శనం కోసం పుట్టపర్తికి వచ్చారు. శాంతిభవన్ అతిథి గృహందు జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ కేంద్ర మంత్రికి పూలబొకే ఇచ్చి స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి బెంగళూరు నుంచి రోడ్డుమార్గంలో ప్రత్యేక కాన్వాయ్‌లో సాయంత్రం 5.15 గంటలకు పుట్టపర్తి శాంతిభవన్ అతిథి గృహం చేరుకున్నారు. ఆయనకు అధికారులు, అనధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. కేంద్ర మంత్రి వెంట జెసి, గోరంట్ల తహశీల్దార్ మారుతి, అధికారులు ఉన్నారు.

రీ సర్వే సమస్యలపై గ్రామసభలు

గోరంట్ల గ్రామసభలో అర్జీలను పరిశీలిస్తున్న తహశీల్దార్ మారుతి

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

మండలంలోని పాలసముద్రం పంచాయతీకి చెందిన కాటేపల్లి గ్రామంలో శుక్రవారం తహశీల్దార్ మారుతి భూ రీసర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి రైతు భూమిలో రీ సర్వే నిర్వహించారని, అందులో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తా మన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ తాతయ్య, పంచాయతీ విఆర్వో, రైతులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండలంలోని కమతంపల్లి రెవెన్యూ గ్రామంలో శుక్రవారం డిప్యూటీ తహశీల్దార్ బాబురావు ఆధ్వర్యంలో భూమి రీసర్వేపై గ్రామసభలు నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దార్ మాట్లా డుతూ భూమి రీసర్వేలో రైతులకు సమస్యలు ఉంటే దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ జాఫర్, రైతులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : రీసర్వే జరిగిన గ్రామాల్లో శుక్రవారం నుంచి గ్రామ సభలు ప్రారంభం అయ్యాయి. అందులో భాగంగా మద్దిమాకులపల్లి పొలానికి సంబంధించిన గ్రామసభను మొరంపల్లిలో నిర్వహించారు. శనివారం కంబాలదిన్నె పొలాలకు సంబంధించి పలగలపల్లి అంగన్వాడీ కేంద్రం వద్ద గ్రామసభ నిర్వహిస్తామని ఇన్‌ఛార్జి తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, రీసర్వే డీటీ యూనస్ తెలిపారు. రైతులు గ్రామ సభలో పాల్గొని భూ సంబంధిత సమస్యలు తెలియజేయవచ్చని తెలిపారు.

రొద్దంలో రీసర్వేపై గ్రామసభ నిర్వహిస్తున్న తహశీల్దార్ నాగేంద్ర

తనకల్లు : మండలంలోని వివిధ గ్రామాల్లో రీ సర్వే జరిగిన ప్రాంతాల్లో ఏవైనా తప్పులు జరిగి ఉంటే గ్రామసభలో అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోవాలని తహశీల్దార్ శోభనువర్ధమ్మ తెలిపారు. ఈ నెల 19న తేదీ దిగువ మండ్లిపల్లి, 22న దండువారిపల్లి, 25న వెంకటరాయునిపల్లి, 27న మద్దినాయనిపాల్యం, 29న ఉబ్బలవాండ్లపల్లిలో గ్రామసభలు నిర్వహిస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రొద్దం : రైతులు జాయింట్ భూములు సబ్ డివిజన్ చేసుకోవాలని తహశీల్దార్ నాగేంద్ర సూచించారు. మండలంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీ సర్వే సమయంలో అందుబాటులో లేని రైతుల భూములను జాయింట్ భూములుగా చూపించారని వాటిని సబ్ డివిజన్ చేసుకోవాలని సూచించారు. స్థానిక రెడ్డిపల్లి సచివాలయంలో తహశీల్దార్ ఆధ్వర్యంలో రీసర్వే వల్ల భూముల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ పరిధిలోని రైతులు హాజరై వారి సమస్యలను అధికారులకు తెలిపారు. జాయింట్ భూములకు సచివాలయ కేంద్రంలో చలానా చెల్లించి సబ్ డివిజన్ చేసుకుంటే సమస్యలు పరిష్కారం అవుతాయని సూచించారు. కార్యక్రమంలో రీ సర్వే డిటి చంద్రశేఖర్, మండల సర్వేయర్ మైనుద్దీన్, వీఆర్వోలు రమేష్, అనిల్‌కుమార్, నాయకులు వెంకట్రామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలకృష్ణతో ఎమ్మెల్యేల భేటీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణతో శుక్రవారం పుట్టపర్తి, రాప్తాడు ఎమ్మెల్యేలు పల్లె సింధూరరెడ్డి, పరిటాల సునీత మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. వారు ఎమ్మెల్యే బాలయ్యతో పలు అభివృద్ధి పనులపై చర్చించారు. పుట్టపర్తి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సిఎం చంద్రబాబును ఒప్పించి హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు తీసుకొచ్చి చెరువులను నింపే బాధ్యత తీసుకోవాలని కోరారు. అలాగే జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని, సాగు, తాగునీటి సమస్య తీర్చాలని కోరారు. జిల్లాకు పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఎమ్మెల్యే బాలకృష్ణతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూర రెడ్డి

వేరుశనగ రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని వేరుశనగ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం నాయకులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్ కోరారు. ఆయన శుక్రవారం మండలం లోని కోడూరు పంచాయతీలో వేరుశనగ పంట ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు వేరుశనగ పంట పూర్తిగా దెబ్బతిందని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ. లక్ష పరిహారం ఇచ్చి ఆదుకో వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్ర, రైతులు క్రిష్టారెడ్డి, రామచంద్ర, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరాయప్ప, నారాయణప్ప, శీవప్ప, శంకరప్ప, శ్రీరామప్ప, నరసింహప్ప నాగప్ప పాల్గొన్నారు.

వర్షాలకు తడిసిన వేరశనగ పంటను చూపుతున్న రైతులు

ఊబిచర్ల ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-నల్లచెరువు

మండలంలోని ఊబిచెర్ల ఆరోగ్య ఉపకేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌ను శుక్రవారం జిల్లా వైద్యాధికా రులు, టాస్క్ ఫోర్స్ బృందం సందర్శించి రికార్డులను పరిశీలించారు. వైద్య సేవలు మరింత మెరుగవ్వాలని సూచించారు. తనిఖీ చేసిన వారిలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, కదిరి డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ నాగేంద్ర, జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ కళాధర్, డిపిఒ నాగరాజు, డిపిహెచ్ఎన్ఓ వీరమ్మ, ఐడిఎస్పి సుబ్బారావు ఉన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కల్పన, సిహెచ్ఓ రామచంద్రారెడ్డి, సూపర్వైజర్లు సుధాకర్, రెడ్డమ్మ, ఎంఎల్‌హెచ్‌పి మౌనిక, ఎఎన్ఎం వనజ, హెల్త్ అసిస్టెంట్లు మున్నా, శ్రీనివాసరెడ్డి, ఆఫీస్ అసిస్టెంట్ రెడ్డిబాషా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వైద్యాధికారులు

మహిళకు కుట్టుమిషన్ వితరణ

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పట్టణంలోని అర్బన్ పోలీస్ స్టేషన్ వద్ద ఒంటరి మహిళకు ఖిద్మత్ ఏ ఖల్క్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి షామీర్ ఆధ్వర్యంలో సిఐ సునీత చేత కుట్టు మిషన్ అందజేశారు. షామీర్ మాట్లాడుతూ కొత్తచెరువు మండలంలోని లోచర్ల గ్రామానికి చెందిన ఒంటరి మహిళ పావని భర్త మృతి చెందగా ఇద్దరు కూతుళ్లను పోషించుకునేందుకు ఇబ్బందులు పడుతుండగా కుట్టుమిషన్ అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాంత్, షాకీర్, శేషు, అలీ, మాల మనోహర్, జావిద్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి అధినేత జగన్‌ను కలిసిన అశ్వర్థనారాయణ

ప్రజాశక్తి-మడకశిర రూరల్

నియోజకవర్గానికి చెందిన వైసిపి ఎస్సీ విభాగం నాయకుడు, న్యాయవాది హరే సముద్రం అశ్వర్థనారాయణ గురువారం రాత్రి తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీయడంతో పాటు పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పని చేయాలని జగన్ సూచించారని ఆయన తెలిపారు.

పాఠశాలల్లోకి వర్షం నీరు

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని కదిరేపల్లి గ్రామంలో చిన్నపాటి వర్షం కురిసినా అంగన్వాడీ, పాఠశాల భవనాల్లోకి నీరు చేరుతుందని ఉపాధ్యాయులు శ్యాంసుందర్, మారుతి, రామకృష్ణ, అంగన్వాడీ కార్యకర్త శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై వారు శుక్రవారం సర్పంచి, పంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కొండపై నుంచి వస్తున్న నీరు పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల ముందుగా ప్రవహిస్తుండడంతో విద్యార్థులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి పాఠశాల, అంగన్వాడీ కేంద్రంలోకి నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని రేకులకుంట ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నారాయణస్వామి శుక్రవారం 30 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో పదో తరగతి వరకూ చదివానని, ఇందులోనే ఉపాధ్యాయుడిగా పని చేయడం సంతోషంగా ఉందన్నారు. నారాయణస్వామిని హెచ్ఎం గిరిజ, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దత్తాత్రేయ, మహలింగప్ప, వేదాచలం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వృద్ధురాలు ఆత్మహత్య

ప్రజాశక్తి-గుడిబండ

రొళ్ల మండలంలోని మల్చంద్రం గ్రామానికి చెందిన నారాయణాచారి భార్య సువర్ణమ్మ(67) గుడిబండలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు, ఎఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు.. నారాయణాచారి, సువర్ణమ్మ దంపతులు ఆరేళ్ల క్రితం పొట్టకూటి కోసం రొళ్ల మండలం నుంచి ఇక్కడికి వలస వచ్చారు. కుమారుడు, కోడలితో కలిసి చిన్న చిన్న కూలి పనులు చేసుకుంటూ ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. సువర్ణమ్మ కొన్ని రోజులుగా బీపీ, షుగర్‌తో బాధపడుతోంది. వైద్యులకు చూపించినా ఉపశమనం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన సువర్ణమ్మ గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉవేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ చంద్రశేఖర్ పోలీసు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

వైసిపి నేత మృతికి నివాళి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని మాగేచెరువు గ్రామంలో గురువారం తేనెటీగల దాడిలో రైతు పెద్దింటి నారాయ ణప్ప మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే శుక్రవారం వైసిపి పట్టణ కన్వీనర్ గోవిందమ్మగారి శ్రీనివాసులు, మాజీ సర్పంచి రమాకాంత్ రెడ్డి ఆ గ్రామం వెళ్లి నారాయణప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు మాట్లాడుతూ నారాయణప్ప కుటుంబంలో కరోనా సమయంలో కుమారుడు, ఆరు నెలల క్రితం నారాయణప్ప భార్య అనారోగ్యంతో మృతిచెందారని విచారం వ్యక్తం చేశారు. వీరి కుటుంబానికి పార్టీ తరపున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ బాబు, పోలేపల్లి హనుమంతుడు, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE : PUTTAPARTHY
O.S.164/2023

Between:
E.Chennappa ...వాది
V/s
1.S.Charitha ...ప్రతివాదులు
2.S.Reddy ...Defendants

SUMMONS TO THE DEFENDANT No.1,2
To.
1.S.Charitha, D/o.Late S.Prasad
2.S.Reddy, S/o.Late S.Prasad

All are residents of old D.No.1-139, By pass Road, Kadiri tower at present Residing at 3-50 and 3-51, Hindupuram, Main Road, Near Pradhama Chikisha Kendram, Gopuram Street, Kadiri, Sri Sathya Sai District.

పై వాది మీపై దావాలోని నగదు మొత్తమును రాబట్టు కొనుటకు పై దావా గల, కోర్టులో వేసి యున్నారు. పై దావాలో కోర్టు వారు మీకు ఎన్నిమార్లు దావా సమన్లు మరియు O.S.No.164/23లో పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేసినారు. కావున పై దావా తేద. **28-10-2024**న వాయిదా ఉన్నది. కావున మీరు సదరు వాయిదాకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవచ్చును. లేనియెడల దావా పరోక్షంగా తీర్మానించబడును. (కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

చల్లా రాజగోపాలు B.A., L.L.B.
న్యాయవాది, పుట్టపర్తి సత్యసాయి జిల్లా.
సెల్: 6302132199, 6302309552

OFFICE OF THE CHAIRMAN, DISTRICT PURCHASE COMMITTEE, OFFICE OF THE COLLECTOR & DISTRICT ELECTION OFFICER, SRI SATHYA SAI DISTRICT, PUTTAPARTHI.
Present: Sri Abhishek Kumar, I.A.S.,

Rc. No. 652/2024/Elections/Cord-I **Dated: 18-10-2024**

PUBLIC NOTICE

Quotations in sealed covers are here by invited from the interested Printing Press Owners for the printing of Draft Electoral Roll and Final Electoral Roll - Special Summary Revision, 2025 in respect of all six Assembly Constituencies of this District. Interested Agencies shall submit their Sealed covers on or before i.e. 23-10-2024 at 05.00 P.M. (Wednesday) at Election Wing, Coordination-I Section, Collectorate, Sri Sathya Sai Dist. Puttaparthi from the date of publication of this Notice along with the following records and fulfill the following requirements .

1.All printouts of Draft Roll and Final Roll-SSR 2025 shall be printed in black and white colour in both sides in A4 size good quality paper with clearly visible letters and photos of voters.
2.The interested Agency shall deposit demand draft for Rs. 50,000-00 (Rupees Fifty Thousand only) stands in favour of the Collector & District Election Officer, Sri Sathya Sai Dist.
3.The interested Agency shall possess GST No. in its name.
4.The interested Agency shall submit I.T. Returns for previous three assessment years.
5.The interested Agency shall possess at least three years experience in the printing of Electoral Rolls work and submit any previous Word Order of the similar work.
6.The interested Agency shall complete agreed work order with in 48 hours from the time of handing over of the Data.
7.The date of opening of sealed covers will be informed to the Agencies before 24 hours after completion of five days.
8.In all aspects of the this subject matter, the decision of the Chairman, District Purchase Committee, Sri Sathya Sai District, Puttaparthi is final. No protests will be entertained in this regard.

Sd/Abhishek Kumar, I.A.S.,
Chairman & Joint Collector, District Purchase Committee,
Sri Sathya Sai District, Puttaparthi.